క్లుప్తంగా

ఆధార్ సేవల శిబిరానికి విశేష స్పందన


దేవరాపల్లిలో ఆధార్ సేవల శిబిరంలో సేవలను వినియోగించుకుంటున్న ప్రజలు

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఆధార్ సేవల శిబిరానికి విశేష స్పందన లభించింది. దేవరాపల్లితో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఈ ఆధార్ సేవల శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కొత్త ఆధార్ నమోదుతో పాటు బయోమెట్రిక్ అప్‌డేట్, డాక్యుమెంట్ అప్‌డేట్, పేర్లు మార్పు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్, జిల్లా మార్పు తదితర సేవలను అందిస్తున్నారు. శిబిరంలో ఆధార్ ఆపరేటర్ యామిని, దేవరాపల్లి గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు ఎం.నంధ్య, ఎస్.కె. మీరాబీ సేవలందించారు.

మాడుగుల : తాటిపర్తి, ముకుందపురం, జేడీపేట, వొమ్మలి గ్రామాల్లో బుధవారం మొబైల్ ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించారు. ఆధార్ అప్‌డేట్, చిరునామా మార్పులు, తప్పొప్పులు సవరణ వంటి సేవలు అందించారు. ఈ సందర్భంగా తాటిపర్తి ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఎంపీడీవో కొంకి అప్పారావు పరిశీలించారు.

వైభవంగా రుద్రహోమం


రుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: పెద్దమిల్లు జంక్షన్‌లో ఉన్న వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం వైభవంగా నిర్వహించారు. శివుడికి ఇష్టమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం ఆ ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు జరిపారు. ఉదయం నుంచి మృత్యుంజయహోమం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమంతోపాటు ఆలయంలో ఉన్న స్వయం భూ లింగానికి పూజలు చేశారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

గుడిసె తొలగించారు న్యాయం చేయండి


నిరాశ్రయురాలైన దేవి

బుచ్చెయ్యపేట : మండలంలో గల ఎల్‌బీపురం గ్రామంలో తన పూరిపాక తొలగించిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితురాలు బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన బోయిన దేవి పూరిపాకలో నివాసం ఉంటూ ఇడ్లీ అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. ఇంటి పక్కన ఉన్న వారు ప్రహరీ నిర్మాణానికి పాక అడ్డు వచ్చిందని తొలగించడంతో దేవి నిరాశ్రయురాలైంది. దీంతో బుధవారం బుచ్చెయ్యపేట ఎస్‌ఐ శ్రీనివాసరావును కలిసి న్యాయం చేయాలని బాధితురాలు ఫిర్యాదు చేసింది.

135 మందికి కంటి వైద్య పరీక్షలు

మాకవరపాలెం : మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరంలో 135 మందికి పరీక్షలు నిర్వహించారు. స్థానిక మహిళా మార్ట్ వద్ద బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 135 మందికి కంటి పరీక్షలు చేసిన 80 మందిని ఆపరేషన్ల నిమిత్తం విశాఖ తరలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివమనోహరనాయుడు, క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనీకుమార్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విస్తారంగా వంగతోట సాగు

కె.కోటపాడు : మండలంలో మెట్టప్రాంత గ్రామాలలో గల రైతులు వంగతోట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రాబోయే కార్తీకమాసంలో కూరగాయల పంటలకు మంచి డిమాండ్ ఉండనున్నది. వంగతోటను రైతులు మండలంలో 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేయనున్నాయి. వర్షాలు లేకున్నా అందుబాటులో ఉన్న బావులు, వ్యవసాయ బోర్లు ద్వారా నీటిని పంటకు తడుల రూపంలో అందించి సాగు చేపడుతున్నారు. పంట సాగుకు దుక్కులు, ఎరువులు, విత్తనాలు, సస్యరక్షణ మందులకు ఎకరానికి రూ.15వేల వరకు పెట్టుబడి ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. డి.అగ్రహారం, పింద్రంగి, లంకవానిపాలెం, దాలివలస, బొట్టవానిపాలెం, ఆర్లి, కె.సంతపాలెం గ్రామాల్లో విరివిగా వంగతోటలు సాగు చేస్తున్నారు.


మాడుగుల నుంచి సాగరం మీదుగా వేసిన తారురోడ్డు


తాచేరు నదిపై పూర్తయిన వంతెన నిర్మాణం

40 గ్రామాల కల నెరవేరిన వేళ!

- ప్రారంభానికి సిద్ధంగా తాచేరు వంతెన
- రూ 3.40 కోట్లతో నిర్మాణం పూర్తి
- గత ప్రభుత్వ హయాంలోనే నిధుల విడుదల
- 40 గ్రామాల రైతుల రాకపోకలకు సౌలభ్యం

మాడుగుల : తాచేరుపై, వంతెన నిర్మాణంపూర్తి కావడంతో తమకు ఏళ్ల నాటి కల నెరవేరిందని, తమ తాతలు, తండ్రుల నాటి నుంచి ఎదురుచూపులు ఫలించాయని మాడుగుల పట్టణానికి చెందిన రైతులతో పాటు 40 గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి తక్కువ దూరంలో రావడానికి తాచేరుపై ప్రస్తుతం నిర్మించిన వంతెనే ఆధారం. పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో డి.గొటివాడ, సత్యవరం, వొమ్మలి, కింతలి, అవురువాడ, పంచాయతీలో 10 గ్రామాలు, కింతలి వల్లాపురం, పనుకు గదబూరు.వీజేపురం, సత్యవరం, డి.గొటివాడ, గిరి గ్రామాలైన కొత్తవలస, రాజంజేట, గొప్పూరు, రావిపాలెం, తదితర గ్రామ ప్రజలు ప్రతి సోమవారం, తాము పండించే పంటలు తాచేరు నది దాటి మాడుగుల వారపు సంతకు వస్తుంటారు. అక్కడే వారానికి సరిపడా సరుకులు కొనుగోలు చేసి తిరిగి తాచేరు నది దాటి వారి గ్రామాలకు సాయంకాలానికి చేరుకుంటారు. వర్షాల్లో వీరు తాచేరు దాటలేక, నరక యాతన పడేవారు. దీంతో గత ప్రభుత్వం హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు మాడుగుల నుంచి సాగరం, డి.గొలివాడ, మీదుగా కొత్తవలస వరకు తారురోడ్డుతో పాటు, తాచేరుపై వంతెనకు రూ 7.40కోట్లు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనా పథకం నిధులు మంజూరు చేయించారు. రోడ్డు పనులు అప్పట్లోనే పూర్తి కావడం జరిగింది. వంతెన పనులు ప్రస్తుతం దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఈ విషయమై జేఈ రమణమూర్తిని, సంప్రదించగా మరో వారంలో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు.

50 రైతు కుటుంబాలకు మేలు

మాడుగుల పట్టణానికి చెందిన సుమారు 50 రైతు కుటుంబాలకు చెందిన పశువులు పాకలు పంట భూములు తాచేరు వంతెన అవతల ఉన్నాయి. వర్షం కురిసిందంటే చాలు సుమారు 30 కిలోమీటర్ల దూరం తిరిగి మాడుగుల చేరేవారు. తుపానులు వస్తే నెలుల తరబడి యేరుదాటే పరిస్థితి ఉండేది కాదు. పంట భూములు, పశువులు ఆవాసం వదులుకోలేక తాతలు తండ్రుల కాలం నుంచి ఈ నాటి వరకూ నరకయాతన పడేవారమని రైతులు సోమిరెడ్డి నూకరాజు, కర్రి రామారావు తెలిపారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తి కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



వంతెన నిర్మాణం అవుతుందని అనుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కావడంతో రోడ్డు అప్పట్లోనే పూర్తి చేశారు. ప్రస్తుతం తాచేరుపై వంతెన పూర్తయింది. మా తాతలు తండ్రులు నాటి కల నేటికి నెరవేరుతుంది. పశువులు పాకలుకు రావాలంటే తాచేరుతో ఇబ్బందులు పడేవాళ్లం. ఉదయం పాకలుకు వస్తే వర్షం కురిస్తే రాత్రికి పాకలు వద్దే మకాం వేసేవారం. వంతెన పూర్తి కావడంతో చాలా ఆనందంగా ఉంది.

– తూరుబిల్లి వెంకటరావు, తాచేరు నది అవతల రైతు

మా కష్టాలు తీరాయి



పశువులు, పంటలు తాచేరు నది అవతల ఉన్నాయి. దీంతో వర్షాకాలం వస్తే పొలాలకు వెళ్లలేక ఇబ్బందులు పడేవారం. తాచేరు పొంగితే పశువుల పాకల వద్దే పస్తులుండేవారం. దశాబ్దాల నుంచి ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుతం వంతెన పూర్తి కావడంతో మా కష్టాలు తీరనున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– కర్రి వెంకటరావు, తాచేరు నది అవతల రైతు.

మాజీ డిప్యూటీ సీఎం కృషి వల్లే..



బూడి ముత్యాలనాయుడుకు రుణపడి ఉంటాం. మండలంలో గల సుమారు 20 నుండి 30 గిరి గ్రామాల రైతులు తాము పండించిన పంటలతో సులువుగా మాడుగుల వారపు సంతకు చేరాలంటే తాచేరు నది దాటవలసిందే. అయితే వర్షాల కాలంలో నానా అవస్థలు పడేవారం. మాజీ డిప్యూటీ సీఎం, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు రోడ్డుతో పాటు, తాచేరుపై వంతెనకు రూ 7.40 కోట్లు నిధులు మంజూరు చేయించారు. అప్పట్లోనే రోడ్డు పూర్తికాగా ప్రస్తుతం వంతెన కూడా పూర్తయింది. మా గిరి గ్రామాలకు చెందిన రైతులు పండించిన పంటలు సులువుగా మాడుగుల వారపు సంతలకు తీసుకెళ్లగలరు. బూడి ముత్యాలనాయుడుకు గిరి గ్రామాల ప్రజలు రుణపడి ఉంటారు.

– శోలం రమేష్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

రెవెన్యూ సదస్సులో 72 దరఖాస్తులు


చింతలపూడి గ్రామ సభలో రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు


కొరువాడ జగన్నాథపురంలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ భాగ్యావతి

నాతవరం : భూరీసర్వేలో జరిగిన లోపాలను సరి చేసేందుకే రెవెన్యూ గ్రామసభలు ఉద్దేశ్యమని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండలంలో ఎస్.బి.,పట్నం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన భూ రీసర్వేలో ఏలాంటి పొరపాట్లు జరిగిన గ్రామసభలో దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం సరి చేస్తామన్నారు. గ్రామంలో ప్రధాన రెవెన్యూ సమస్యలు కూడా సభ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ గ్రామసభలో రీసర్వేలో జరిగిన తప్పుల కారణంగా 72 మంది రైతులు దరఖాస్తులు చేశారన్నారు. వాటిని ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం సరి చేస్తానన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ గ్రామసర్పంచ్ సత్యనారాయణ మండల సర్వేయరు ప్రసాద్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోలుగుంట : చింతలపూడి గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు భూ హక్కులు, క్రయ, విక్రయాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన ఐదు వినతులను స్వీకరించారు. ఆర్.రామ్మూర్తి వాటిని నమోదు చేసుకున్నారు. మండల సర్వేయర్ రెడ్డి తవిటినాయుడు, వీఆర్వోలు శ్రీనివాసరావు, భాస్కరరావు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

దేవరాపల్లి : నాగయ్యపేటలో రెవెన్యూ గ్రామ సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి రైతులు 32 అర్జీలు అందించారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ జి. గోవిందరాజులు, స్థానిక వీఆర్‌వో జానకీ, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : కొరువాడ జగన్నాథపురం గ్రామంలో బుధవారం రీసర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్ పుస్తకాలలో ఆధార్ నంబర్, భూ విస్తీర్ణం, సర్వే నంబర్లు, రైతుల పేర్ల నమోదులో తప్పొప్పులపై 33 మంది అర్జీలు అందించారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది పరిశీలించి వాటికి 15 రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భాగ్యావతి అన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సూరి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

సకాలంలో భూ సమస్యల పరిష్కారం

మాకవరపాలెం: భూ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రీ సర్వే డీటీ కృష్ణమూర్తి తెలిపారు. రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు బుధవారం స్థానిక సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. పలు భూ సమస్యలపై 43 మంది రైతులు అధికారులకు దరఖాస్తులు అందజేశారు.కార్యక్రమంలో ఆర్‌ఐ జెట్టి, ఉప సర్పంచ్ రాము, వీఆర్వో లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : వంటర్లపాలెం పంచాయతీ కార్యాలయంలో బుధవారం రీ సర్వే రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. అభ్యంతరాల స్వీకరణకు, సరిహద్దు వివాదాలు, సర్వేలో లోపాలు సరిదిద్దుకోవాలని తహసీల్దారు కె.రమాదేవి రైతులకు సూచించారు. ఈ గ్రామ సభలో రీసర్వే డీటీ గణపతిరావు, వీఆర్‌వో మురళి, స్థానిక సర్పంచ్ నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్నం, మాజీ సర్పంచ్‌లు దండి అప్పారావు, కుమారరాజు, నాయకులు కోన శ్రీనివాస్, దండి బాబూరావు, వీఆర్‌ఏ దోని చిన అప్పారావు పాల్గొన్నారు.

భూములను ఆన్‌లైన్‌లో చేర్చాలి


విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ వేణుగోపాల్

గొలుగొండ: బ్రిటీష్ కాలం నుండి అన్ని అనుమతి పత్రాలతో గిరిజన ప్రాంతాల్లో ఉన్న గిరిజనేతల భూములకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మాజీ జడ్పీటీసీ చిటికెల వేణుగోపాల్ కోరారు. ఆయన అల్లూరి పార్కులో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి గిరిజన ప్రాంతాల్లో ఉన్న భూములు సాగు చేస్తున్నా నేటికీ ఆన్‌లైన్ కాకపోవడం వల్ల ప్రభుత్వ పరంగా ఎటువంటి రాయితీలు పొందలేకపోతున్నామని ఆవేదన చెందారు. 150 సంవత్సరాలు క్రితం బ్రిటిష్ కాలంలో అనుమతులతో కొనుగోలు చేసిన భూములకు పట్టాలు లేవని తెలిపారు. 1/70 యాక్టుకు ముందే చాలా మంది రైతులు భూములు కొనుగోలు చేసుకున్నా ఇప్పటికీ హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. భూములు సాగు చేస్తున్నా ఆన్‌లైన్‌లో పేర్లు లేకపోవడంతో ఎటువంటి లబ్ధి పొందలేకపోతున్నామని అధికారులు చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎల్‌పురం ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ పాల్గొన్నారు.

బెన్నియ్యనాయుడుకు మాజీ ఎమ్మెల్యే గణేష్ నివాళి


బెన్నియ్యనాయుడు (ఫైల్)


బెన్నియ్యనాయుడు భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ : పాకలపాడు మాజీ సర్పంచ్ మేడిశెట్టి బెన్నియ్యనాయుడు భౌతికకాయాన్ని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం రాత్రి ఇంటికి వెళ్లి సందర్శించి నివాళులు అర్పించారు. అనారోగ్యంతో బెన్నియ్యనాయుడు బుధవారం మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. బెన్నియ్యనాయుడు సీనియర్ నాయకుడిగా ప్రజలతో నిత్యం కలిసి ఉండి ప్రజా సమస్యల పరిష్కారం చేయడం జరిగిందని ఆయన మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అని గణేష్ తెలిపారు. బెన్నియ్యనాయుడు కుటుంబాన్ని పరామర్శించి అధైర్యపడవద్దని ధైర్యం తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఏకా శివతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

గొలుగొండ : పాకలపాడు మాజీ సర్పంచ్ మేడిశెట్టి బెన్నియ్యనాయుడు(74)బుధవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన గత 40 సంవత్సరాలు నుంచి గ్రామ రాజకీయాలతో పాటు మండల రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, తంగేడి రాజుల హయాంలో ఆయన గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి మరణం అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరి 2019లో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గెలుపునకు కీలకపాత్ర పోషించారు. ఆయన మరణం పట్ల మండల నాయకులతో పాటు జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. గురువారం పాకలపాడులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఉపాధి ఏపీవోగా మురళీకృష్ణ

మాడుగుల రూరల్ : ఉపాధి హామీ పథకం ఏపీవోగా జె. మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చెయ్యపేట మండలం నుంచి ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.ఈశ్వరరావు రోలుగుంట మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఏపీవో మురళీకృష్ణ స్థానిక ఎంపీడీవో కె.అప్పారావును మర్యాద పూర్వకంగా కలిశారు.

ఉగ్గినవలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

కె.కోటపాడు : ప్రతి నెలకు ఒక రోజు గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను గ్రామాల్లో రోగులు ఉపయోగించుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. ఉగ్గినవలస గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు జరిపారు. 89 మందికి వైద్యం అందించి మందులను ఉచితంగా అందించారు. ఎపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో హెచ్.ఎస్ సన్యాసిరావు, హెచ్.ఎ.ఆర్.గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీ మంగవేణి, ఏఎన్‌ఎం. రాము, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి పనిచేయాలి

నాతవరం : ప్రభుత్వ నిబంధనలు లోబడి అధికారులంతా పని చేయాలని మండల పరిషత్ కార్యాలయ సూపర్‌డెంటు పోలుపర్తి పార్థసారధి అన్నారు. మండల స్థాయి అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. కాలానుగుణంగా వస్తున్న పరిపాలన అవసరాల రీత్యా క్షేత్రస్థాయిలో క్లాస్ 5,4 ఉద్యోగులలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించాలన్నారు.కార్యక్రమంలో గొలుగొండ ఐసీడీస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ వెలుగు ఉపాధి హామీ పథకం సోషల్ వెల్ఫేర్ అధికారులతో పాటు జేఈలు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజుల విడుదలకు విద్యార్థుల ఆందోళన


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ నేతలతో కలసి బుధవారం ఆందోళన చేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. కార్యాలయం ఎదుట ఆందోళన చేశా రు. విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి అభిషేక్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుద ల కాకపోవడం దారుణమన్నారు. దీనివల్ల పేద విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేస్తున్నారన్నా రు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల ప్రహరీల నిర్మాణానికి రూ.9.40 కోట్లు మంజూరు

దేవరాపల్లి : మాడుగుల నియోజకవర్గంలోని 62 ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.9 కోట్ల 40 లక్షల 78 వేలు నిధులు మంజూరయ్యాని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే బండారు క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదల చేశారు. చీడికాడ మండలంలో 11 స్కూళ్లకు రూ. కోటి 49 లక్షల 95 వేలు, దేవరాపల్లి మండలంలో 18 స్కూళ్లకు రూ. 2 కోట్ల 76 లక్షల 67 వేలు నిధులు మంజూరయ్యాయన్నారు. కె.కోటపాడు మండలంలో 22 స్కూళ్లకు రూ. 3 కోట్ల 74 లక్షల 10 వేలు, మాడుగుల మండలంలో 11 స్కూళ్లకు రూ. కోటి 40 లక్షల 07 వేలు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

తహసీల్దార్ నాగమ్మ బాధ్యతల స్వీకారం

రోలుగుంట : రోలుగుంట తహసీల్దార్‌గా శెట్టి నాగమ్మ బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. భూ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి, పరిశీలించి ఆర్థిక పరమైన , న్యాయ వివాదాలు ఉన్న సమస్యలు మినహా తన పరిధిలో ప్రతి వినతిని పరిశీలించి చర్యలు తీసుకుంటానని అన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో తన కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. 24/7 రైతులకు సేవలందించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశానని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు


ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి తాగునీటి సమస్య వివరిస్తున్న సర్పంచ్ రమణ

మాకవరపాలెం: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ రుత్తల లక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ఆయాశాఖల ప్రగతి నివేదికలు, ప్రస్తుతం ప్రభు త్వం అమలు చేస్తున్న పథకాలను సభ్యులకు వివరించారు. అనంతరం నిర్వాసిత సంఘ అధ్యక్షుడు, బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడు మాట్లాడుతూ అన్‌రాక్ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. మామిడిపాలెం సర్పంచ్ బుడ్డా రమణ మాట్లాడుతూ అడిగర్లపాలెం, మామిడిపాలెం గ్రామాల్లో ప్రజలకు నిత్యం తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, డీటీ సోమశేఖర్, ఎస్‌ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

రైతు వ్యాపారిగా మారాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

మాడుగుల: రైతులు పంటలు పండించడమే కాకుండా తాము పండించిన పంటలు విక్రయించి వ్యాపారులుగా మార్పు చెందితేనే అధిక లాభాలు వస్తాయని, భారతీయ కిసాన్‌సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కుమారస్వామి అన్నారు. బుధవారం మాడుగులలో తెన్నేటి రైతు ఉత్పత్తి రైతులుతో ఏర్పాటు చేసిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఉత్పత్తిదారు కమిటీ ఆధ్వర్యంలో మాట్లాడారు. చెరకు పండించే రైతులు బెల్లం తదితర పదార్థాలు తయారు చేసి ఘధ్య దళారులు లేకుండా రైతులే స్వయంగా తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవాలని తద్వారా ఆర్థికంగా స్థిరపడతారని తెలిపారు. ఈ సంఘం రైతులుకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి దేశ వ్యాప్తంగా ఈ సంఘాలు కృషి చేస్తాయన్నారు. నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా 10 వేల సంఘాలు ఏర్పాటుకు నాంది పలికారన్నారు. మైక్రో ఇరిగేషన్ ఫీల్డ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకుడు పుట్టా గంగయ్య, సర్పంచ్ ఎడ్ల కళావతి పాల్గొన్నారు.

వరిలో సుడిదోమ నివారించాలి

మాడుగుల : సుడిదోమ ఆశిస్తే ఎపిసేట్ అనే మందును లీటరు నీటికి 1.5 గ్రాములు మందును కలిపి పిచికారి చేయాలని, వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు అన్నారు. బుధవారం మాడుగుల పంట పొలాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి చేలు సిరి పొట్ట దశలో ఉన్నందున దోమ ఆశించే ప్రమాదం ఉందని, దీనివల్ల చేలు పసుపు రంగుగా మారిపోయి కంకి తెల్లబడే అవకాశం ఉందన్నారు. దోమ అధికంగా ఉంటే డైనెటోఫ్యూరాన్ అనే మందు లీటరు నీటికి 0.4 మిల్లీ లీటర్ల మందు కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, వార్డు మెంబరు జవ్వాది వరహాలు స్థానిక నాయకులు పుప్పాల రమేష్, రైతులు పాల్గొన్నారు.